క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో పాల్గుణ మాసం సోమవారం సందర్భంగా శివమాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డెమో రైలు సమయంలో మార్పు తగదు

కోవెలకుంట్ల: నంద్యాల–ఎర్రగుంట్ల రేల్వే మార్గంలో ప్రతి రోజు తిరిగే డెమో రైలు సమయాన్ని యథావిధిగా కొనసాగించాలని రాయలసీమ స్టూడెంట్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసు అన్నారు. సోమవారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడారు. నంద్యాల నుంచి తిరుపతి జిల్లా రేణిగుంట వరకు నడిచే డెమో రైలు ఉదయం 6.30 గంటలకు బయలుదేరేదన్నారు. ఇదే సమయంలోనే కాచిగూడ–గుంటూరు రైలు నంద్యాలకు చేరుకుంటుందన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు నంద్యాలకు చేరుకునేసరికి డెమో రైలు అందుబాటులో ఉండేదన్నారు. బనగానపల్లె, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ప్రజలకు ఈ సమయం ఎంతో అనువుగా ఉండేదని పేర్కొన్నారు. ఇటీవల ఆ సమయాన్ని ఉదయం 6 గంటలకు మార్పు చేశారన్నారు. దీని వల్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి నంద్యాల నుంచి ఉదయం 6.30 గంటలకు రైలు బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'98' డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కోవెలకుంట్ల: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జిగాళ్ల లింగన్న అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీలో అర్హత సాధించి సుమారు 27 ఏళ్లు కావస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 4వేలకు పైగా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. మిగిలిపోయిన వారిలో ఇప్పటికే చాలా మంది వయోపరిమితి దాటిపోయారని చెప్పారు. క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని 2024 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అభ్యర్థుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు.

మహిళా సాధికారతతోనే దేశ పురోగతి



విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

బేతంచెర్ల: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా దేశ పురోగతి సాధ్యం అవుతుందని సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. సోమవారం బేతంచెర్లలోని జ్ఞాన సరస్వతి డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత వారోత్సవాల సందర్భంగా డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్యాపిలి: గాలికుంటు వ్యాధి నివారణకు మంగళవారం టీకాలు వేయనున్నట్లు జలదుర్గం పశువైద్యాధికారి విద్యాసాగర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఏనుగుమర్రి, బూరుగల పశువైద్యశాలల్లో పెద్ద పశువులకు ఈ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. వేసవిలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి ప్రబలకుండా టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పశుపోషకులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు.

విద్యుత్ శాఖ ఈఈగా కమలాకర్‌రావు

డోన్ టౌన్: విద్యుత్‌శాఖ డోన్ డివిజన్ నూతన ఈఈగా కమలాకర్‌రావు సోమవారం విధులకు హాజరయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన ఈఈ పలు ఆరోపణలతో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లాలో డీఈఈగా పనిచేస్తున్న కమలాకర్‌రావు పదోన్నతిపై డోన్‌కు ఈఈగా వచ్చారు. గత వారం బాధ్యతలు తీసుకుని వెళ్లిపోయారు. సోమవారం విధులకు హాజరుకావడంతో ఆయన్ను డోన్ డీఈఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి, జేఈలు నాగరాజు, శివ, ఆదిలక్ష్మితో పాటు కార్మిక సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఆటో డ్రైవర్ల ధర్నా

డోన్ రూరల్: పోలీసుల తీరుకు నిరసనగా స్థానిక పాతబస్టాండ్ వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేయనున్నట్లు పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. పోలీసులు తనిఖీల పేరుతో జరిమానాలు విధించి ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఆటో కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.



డాక్టర్ రామసుబ్బయ్య పార్కు వీధిలో చెట్లను నరికి వేసిన స్థానికులు



షాదీఖాన వద్ద డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



తోపుడు బండి లేక చెత్తను సంచిలో ఎత్తుతున్న కార్మికుడు

'చెత్త' శుద్ధి ఏదీ..?

- జనాభాకు అనుగుణంగా లేని కార్మికులు
- మరమ్మతులకు గురైన చెత్త తరలింపు వాహనాలు
- సాధ్యపడని చెత్త తరలింపు
- కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలతో పట్టణంలో పేరుకుపోయిన చెత్త, చెదారం

డోన్: గత వైఎస్సార్‌సీపీ హయాంలో డోన్ మున్సిపాలిటీ రోల్ మోడల్‌గా నిలిచేది. అభివృద్ధి, పచ్చదనం–పరిశుభ్రతతో కళకళలాడేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. పారిశుద్ధ్యంపై దృష్టి సారించకపోవడంతో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయాయి. దీనికి తోడు తమకు అనుకూలమైన ప్రసాద్‌గౌడ్‌ను మున్సిపల్ కమిషనర్‌గా నియమించుకుంది. గతంలో పనిచేసిన కమిషనర్‌లందరూ మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లను సమన్వయం చేసుకుని పట్టణాభివృద్ధికి కృషి చేశారు. అయితే 8 నెలల క్రితం పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌గౌడ్ కౌన్సిలర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుండటంతో అభివృద్ధి కుంటుపడింది.



లిఫ్టు పనిచేయక పోవడంతో చేతులతో చెత్తను ఎత్తిపోస్తున్న కార్మికులు



మొరాయించిన ట్రాక్టర్‌ను నెట్టుతున్న కార్మికులు (ఇన్‌సెట్) పాతబస్టాండ్ వద్ద..

అరకొర సౌకర్యాలు

పట్టణంలో ప్రతి రోజూ తడిచెత్త 15 టన్నులు, పొడి చెత్త 14 టన్నులు వెరసి 29 టన్నుల చెత్తను కేవలం 6 చిన్న ఆటోలు, 2 కాంపాక్టర్లు, 3 ట్రాక్టర్ల ద్వారా తరలించాల్సి వస్తోంది. ఇందులో కాంపాక్టర్ల వాహనాలకు లిఫ్టు చెడిపోవడంతో కార్మికులు చేతులతోనే చెత్తను ఎత్తివేయాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతోంది. ఇక ట్రాక్టర్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. సెల్ఫ్‌లు పనిచేయక ఎక్కడపడితే అక్కడ మొరాయిస్తున్నాయి. చెత్త సేకరణ అధికం కావడం, వాహనాలు, కార్మికుల సంఖ్య తక్కువ కావడంతో పలుచోట్ల చెత్త తొలగింపు సాధ్యపడటం లేదు. దీంతో దుర్వాసన భరించలేని స్థానికులు తమ ఇళ్ల వద్ద చెత్త తొట్లకు నిప్పు పెడుతున్నారు. పలు వీధుల్లోని ప్రధాన కాల్వలు పూడిక తీయకపోవడంతో డ్రైనేజీలన్నీ పొంగి పొర్లుతున్నాయి. పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కానరాని పరిశుభ్రత

లక్ష జనాభా ఉన్న మున్సిపల్ పరిధిలో 150 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సి ఉండగా, 107మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కార్యాలయాల్లో పనిచేసేందుకు కొందరు, కమిషనర్ వెంట ఫొటోలు తీసేందుకు ఇద్దరు, వంట పనికి, ఇంటి పనికి మరికొంత మందిని వినియోగిస్తుండడంతో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 90కి పడిపోయింది. దీంతో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా చెత్త పేరుకుపోయింది. మృతిచెందిన ఆరుగురు కార్మికుల కుటుంబాలకు కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలను కమిషనర్ ఇవ్వలేకపోయారు. శానిటేషన్ అధికారిగా పనిచేసేందుకు జిల్లాలో ఎవరూ డోన్‌కు వచ్చేందుకు ఇష్టపడకపోవడంతో సచివాలయ ఉద్యోగి సునీల్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించాల్సిన దుస్థితి నెలకొంది.

పచ్చదనానికి పాతర

గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచనల మేరకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులందరూ దాతల సహకారంతో సుమారు 4 వేల మొక్కలను పట్టణ వ్యాప్తంగా నాటారు. 8 నెలల నుంచి మొక్కలను వంట చెరుకు కోసం కొందరు విచ్చలవిడిగా నరికి తీసుకెళ్తున్నా అడ్డుకునే వారే కరువయ్యారు. దీంతో పచ్చదనమనే మాట పరిశుభ్రతతో పాటే కనుమరుగైంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనిచేయగలిగితే పట్టణానికి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది. స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మున్సిపల్ అధికారుల అలసత్వాన్ని ఏకపక్ష నిర్ణయాలను సమరించకుండా ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలిక కార్మికులను నియమిస్తాం

పట్టణంలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందు కోసం 20 మంది తాత్కాలిక కార్మికులను నియమిస్తాం. చెడిపోయిన వాహనాలకు మరమ్మతులు చేయిస్తాం. పట్టణంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపునకు కృషి చేస్తాం.

– ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, డోన్

వేడుకగా శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఏక శిలారూపంలోని స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు కుర్చీలు అందజేత



కుర్చీలు, టేబుల్ అందజేస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: కొత్తపేటలోని బీసీ బాలికల హాస్టల్‌కు అవసరమైన సామాన్లను దాత మార్రెడ్ల రాజశేఖర్ రెడ్డి సహకారంతో వివేకానంద సేవా సమితి సభ్యులు అందజేశారు. సోమవారం వసతి గృహాన్ని సందర్శించారు. విద్యుత్ ఫోకస్ లైట్లు, ట్యూబ్ లైట్లు, టేబుల్, కుర్చీలతో పాటు 10వ తరగతి విద్యార్థినులకు పరీక్షల సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు జగన్‌మోహన్, అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప, గంగిశెట్టి వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు సర్వజ్ఞమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 29 మంది గైర్హాజరు



బేతంచెర్ల పరీక్ష కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 385 మంది విద్యార్థులకు గాను 356 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియదాసు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాజా దిలీప్ కుమార్ తెలిపారు. 29 మంది గైర్హాజరయ్యారన్నారు.

ప్యాపిలిలో ఇద్దరు గైర్హాజరు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 108 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామకృష్ణయ్య తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

డోన్ రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. డోన్ మండలం వెంకటనాయునిపల్లి, కామగానికుంట్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో త్వరగా చేతికి వచ్చే కూరగాయాల పంటలను సాగు చేసుకుని అధిక లాభాలను పొందాలని సూచించారు. బోర్లలో నీటి శాతం తక్కువగా ఉంటుందని, భూగర్భ జలాలు అడుగంటిపోతాయని.. రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి లోకేష్, ఐసీఆర్‌పీలు ప్రసాద్, కృపావతి, హైమావతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సీడీపీఓ

బనగానపల్లె రూరల్: బాల్యవివాహాలతో మానసిక, అనారోగ్య సమస్యలు వస్తాయని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాల్యవివాహాల నిర్మూలనపై తహసీల్దార్ కార్యాలయంలో సంతకాల సేకరణ జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలపై లింగ వివక్ష చూపకూడదని తెలిపారు. ఇద్దరినీ సమానంగా చూడాలని సూచించారు. బాలికలను బాగా చదివించి జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలను నిర్మూలిద్దాం అని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎం శ్రీనివాసులు, ఏఓ సుబ్బారెడ్డి, ఆర్‌ఐ ప్రవీణ్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, లక్ష్మీ శైలజ పాల్గొన్నారు.

అడవికి నిప్పు..వన్యప్రాణులకు ముప్పు



పోతుదొడ్డి వద్ద కొండకు నిప్పు పెట్టడంతో చెలరేగుతున్న మంటలు



రోడ్డుకు ఆనుకుని ఉన్న ఎండుగడ్డికి నిప్పు

ప్యాపిలి: కొద్ది రోజులుగా కొందరు వ్యక్తులు పొలాలకు ఆనుకుని ఉన్న అటవీప్రాంతానికి నిప్పు పెడుతున్నారు. కొండలు, గుట్టలు సైతం అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇష్టానుసారంగా మంట పెడుతుండడంతో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాణులు అగ్నికి కాలి బూడిదవుతున్నాయి. కొండలకు పెట్టిన నిప్పు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండుగడ్డికి సైతం వ్యాపిస్తోంది. కమ్ముకున్న పొగ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంటల వేడిమికి ద్విచక్రవాహన చోదకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు, తోటలకు సైతం నిప్పంటుకోవడంతో పచ్చని చెట్లు సైతం కాలిపోతున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కొండలకు నిప్పు పెట్టడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఐదు ఆటోలు సీజ్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించి ఐదు ఆటోలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని నంద్యాల, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు వైపు వెళుతున్న ఆటోలను నిలిపివేశారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండడంతో డ్రైవర్లపై కేసు నమోదు చేసి ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి మృతి

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన యువకుడు పేడమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రమణయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బిరుసంటి చిట్టిబాబు (29) మద్యానికి బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం జీవితంపై విరక్తి చెంది పేడమందు సేవించాడు. కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య లలిత, కూతురు ఉంది. తండ్రి బిరుసంటి భూషనం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో మాదిగల శ్మశాన వాటిక రస్తా ఆక్రమణకు యత్నిస్తున్నారని.. చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంబగిరి రాముడు కోరారు. ఈ మేరకు సోమవారం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు శ్మశాన వాటిక రస్తా ఆక్రమణకు యత్నిస్తున్నారని ఆరోపించారు. బాలయ్య, వెంకటటేశ్, రమేష్ ఉన్నారు.

విద్యార్థులకు టోపీల పంపిణీ

డోన్: వేసవి నేపథ్యంలో ఎండ నుంచి రక్షణ కోసం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన స్టీఫెన్ ఉచితంగా టోపీలను పంపిణీ చేశారు. స్థానిక నల్లగుట్ట ఎంపీపీ స్కూల్‌లో సోమవారం పాఠశాల హెచ్‌ఎం మురళిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

డోన్/డోన్ టౌన్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఫిబ్రవరి 23వ తేదీ నిర్వహించిన జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్‌కు చెందిన జ్యోతి పాఠశాల విద్యార్థులు సాయిచరణ్, మహీధర్ ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. కటా విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థులను స్కూల్ హెచ్‌ఎం వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు సత్కరించారు.

విద్యతోనే సమాజంలో మార్పు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివించి వారి ఉన్నతికి పాటుపడాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ శివారులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ..గతంలో మహిళలు చదువు లేకుండా వంటింటికి పరిమితమయ్యే వారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలపారు. మహిళల హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు దాత కృష్ణమూర్తి(విద్యుత్ లైన్‌మెన్) సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక, క్లబ్ సభ్యులు సుదర్శన్, రవి, వలిబాషా, కేశాలు నాయుడు పాల్గొన్నారు.

గోపురం నుంచి కిందపడిన వ్యక్తి మృతి



నరేంద్ర మృతదేహం

బనగానపల్లె రూరల్: యాగంటి ఆలయ గోపురం నుంచి కిందిపడి తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి వివరాల మేరకు.. యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ అలంకరణ టెండర్‌ను ఆళ్లగడ్డకు చెందిన సంజీవరాజు దక్కించుకున్నాడు. చాగలమర్రి మండలం పెద్దబోధనం గ్రామానికి చెందిన ఓబులేసు, చెన్నమ్మ దంపతుల కుమారుడు నరేంద్ర (21) ఇతని వద్ద కూలి పనికి వచ్చాడు. పెద్దగా పని తెలియకపోయినా గోపురంపై అలంకరించిన విద్యుత్ వైర్లను తొలగించేందుకు బలవంతంగా పైకి ఎక్కించారు. వైర్లను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. కాలు, తలకు తీవ్ర గాయాలు కావడంతో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు ఎస్ వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

పశువులకు గాలికుంటు టీకాలు





డోన్, బెలుం శింగవరంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న వైద్యులు

డోన్: పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణకు ఈనెల 3 నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా టీకాలను వేస్తున్నట్లు పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని తారకరామనగర్‌లో గాలికుంటు వ్యాధికి టీకాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పశువుల్లో ముఖ్యంగా 3 నెలలు పైబడిన దూడల్లో తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ కారడం, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, చూడి పశువులు ఇంకిపోవడం, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం, పాలు తాగే దూడలు మృత్యువాతపడడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పశువైద్యశాలలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. టీకాలతో కలిగే లాభాలను పాడిరైతులకు వివరించారు. పశువైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, నవ్య ఉన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని బెలుం, బెలుం శింగవరం గ్రామాల్లో సోమవారం 550 పశువు లకు గాలికుంటు నివారణ కోసం టీకాలు వేసి నట్లు పశువైద్యాధికారి రమేష్‌బాబు తెలిపారు. రోజుకు ఒక గ్రామం చొప్పున ఈనెల 31వ తేదీ వరకు ఈకార్యక్రమం జరుగుతుందన్నా రు. నాలుగు నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని పాడిరైతులకు సూ చించారు. టీకాలతోనే గాలికుంటు వ్యాధిని ని వారించవచ్చని చెప్పారు. రైతులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి ఇతర పశువులకు గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు త మ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.